# స్పందన

'పేపరు చదవందే ఉదయం గడవదు. అయినా ఈ మధ్య పేపరు చూడాలంటేనే జలదరింపుగా వుంటోంది...' అనుకుంటూ పేపరు తీసాడు జగన్నాథం.

వరసగా ఆత్మహత్యల వార్తలే!

ఒక రైతు అప్పుల బాధలతో, ఒక విద్యార్థి పరీక్ష ఫెయిలైనందుకు, ఒక శాస్త్రవేత్త ఒంటరితనం తట్టుకోలేకనూ ఆత్మహత్య చేసుకున్నారుట! ఒంటరితనం! అమ్మో ఎంత భయంకరమో! అది తను అనుభవిస్తున్నదేగా!

ఇక పేపరు చదవాలనిపించలేదు జగన్నాథానికి. భార్య ఫోటో వంక చూసి ఇంటికి తాళం వేసి బయటకు నడిచాడు. జగన్నాథం నడుస్తుంటే ఎవరో ఒకరు వచ్చి చేరతారు. పనిలో పనిగా తమ జబ్బుల గురించి ఏకరువు పెడతారు.

అందరికీ ఓపిగ్గా సమాధానం చెపుతాడు.

ఇంతలో "గుడ్ మార్నింగ్‌సార్" అనే పిలుపు.

వెనక్కి తిరిగాడు.

అప్పుడప్పుడు ఉదయం పూట కనిపించే ముఖమే.

"సార్ రోడ్డు మధ్యలో మిమ్మల్ని ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు ఆ వ్యక్తి.

"సార్... నాకీ మధ్య బెంగగా వుంటోంది. రేపు ఏమవుతుందో అన్న భయంతో నిద్రపట్టడం లేదు. రాత్రంతా ఆలోచనలతో గడుస్తోంది. ఇలా అని నాకు ఏ సమస్యా లేదు. అయినా ఆందోళనగానే వుంటోంది. ఏం చెయ్యమంటారు?" అన్నాడు.

జగన్నాథం కొంచెం సేపు ఆలోచించి, "గతం ఒక హిస్టరీ. అంటే చరిత్ర, భవిష్యత్తు ఒక మిస్టరీ. అంటే అంతు చిక్కనిది. ఇక వర్తమానం అంటే మనం దాన్ని ఇంగ్లీషులో ప్రెజంట్ అంటాము. అంటే బహుమతి. అందుకే వర్తమానంలో జీవించు, భవిష్యత్తు గురించి బెంగపడకు" అన్నాడు. తాను ఎక్కడో చదివిన కొటేషన్ గుర్తుకు తెచ్చుకుంటూ.

ఆ మాటలు ప్రశాంతంగా విన్న ఆ వ్యక్తి, "చాలా బాగా చెప్పారు" అనుకుంటూ నమస్కారం పెట్టి వెళ్లి పోయాడు.

ఆ వ్యక్తి గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు జగన్నాథం.

'నిరంతరం భయంతో గడుపుతారు కొందరు. చావంటే భయం. మరికొంత మందికి బ్రతుకంటే భయం. భలే విచిత్రమైంది జీవితం. ఈ క్షణం అనివార్యం... ఇలా అనుకుంటే బావుంటుందేమో!'

"సార్ నమస్కారం!"

ఆ పిలుపు విని ఆలోచనల్లోంచి బైట కొచ్చాడు జగన్నాథం

అతను మందులషాపు కుర్రాడు.

"సారీ సార్, మేడమ్‌గారి వార్త తెలిసింది. ఆ తర్వాత మీకు బైపాస్ సర్జరీ. మందులు షాపు బిల్లు ఇవ్వడం లేటయ్యింది. ఇంటికి వెళ్లేసరికి తాళం వేసి ఉంది. సాయంత్రం తీసుకురమ్మంటారా?" అన్నాడు.

"పరవాలేదు ఇచ్చేయండి. డబ్బులకు సాయంత్రం రండి" అంటూ ఆ బిల్లు తీసుకున్నాడు.

ఆ బిల్లు చూస్తూ నడుస్తున్నాడు. ఇంజక్షన్లు, సిరంజీలు వాటితోపాటూ నిద్ర మాత్రల పేరు చూసి ఆలోచనలో పడ్డాడు. 'తను వాటిని తెప్పించిన గుర్తులేదు. మరి బిల్లులోకి ఎలా వచ్చాయో!' ఆలోచిస్తూనే ఇల్లు చేరు కున్నాడు జగన్నాథం.

*    *    *

కిటికీలోంచి చూసాడు. ఎవరో ఫేనుకు వేళాడుతున్నారు. తెల్లటి బట్టల్లో తెల్లటి మనిషి తలుపు దబదబమని బాదేడు జగన్నాథం. ఉరి తీసుకుంటున్న వ్యక్తి తలుపు తెరవలేదు. కళ్లు మత్తుగా ఉన్నాయి. మూసుకుపోతున్న కనురెప్పల్ని జగన్నాథం బలవంతంగా తెరిచాడు. పల్చటి బెడ్‌లైట్ వెలుగు. 'మైగాడ్ ఇదంతా కలా!' ఆత్మహత్యల వార్తలు పేపర్లో చదువుతుంటే ఆవే కల్లల్లోకి వస్తున్నాయి అనుకున్నాడు జగన్నాథం.

మళ్లీ తలుపు దబ దబమని గట్టిగా బాదుతున్న చప్పుడు. 'ఓహో నిజంగానే ఎవరో తలుపు కొడుతున్నారు. అదే కలగా కలిగిన ఫీలింగ్. కంగారుగా తలుపు కొడుతున్నారంటే చాలా సీరియస్ కేసయివుంటుంది' అనుకుంటూ తలుపు తెరిచాడు.

ఎదురుగా పద్దెనిమిదేళ్ల కుర్రాడు.

"డాక్టరుగారూ, మా బాబాయ్ ఉరి పోసుకుంటున్నాడు. వెంటనే ఆయనను ఆపు చేసాం. తొందరగా రండి" అన్నాడు మీరు ఆయాస పడుతూ.

స్టెతస్కోపు, ఇంకా అవసరమైన మందులు తీసుకుని వేగంగా బయటకు జగన్నాథం.

"మీ ఇంటికి దగ్గర్లోనే వుందిసార్. మా ఇల్లు" అని ఆ కుర్రాడు అనడంతో కారు తియ్యకుండానే ఆయన గబ గబ నడుస్తున్నాడు. రెండు నిమిషాల్లో ఇల్లు చేరుకున్నారు. ఆ ఇంటి ముందు చాలా మంది గుమికూడి కనిపించారు. లోపలికి వెళ్లేసరికి మంచం మీద యాభయ్యేళ్ల వ్యక్తి బలహీనంగా శ్వాస తీసుకుంటున్నాడు. మెడ క్రింద గొంతు మీద కమిలిన గుర్తులు.

అతడి గుండె మీద మెల్లగా జగన్నాథం కొట్టేడు. ముక్కు మూసి

నోట్లోకి గాలి బలంగా ఊదాడు. రెండు ఇంజక్షన్లు చేసాడు. ఆ వ్యక్తిలో మెల్లగా చలనం. వెంటనే ఉరి నుండి దించేసారు. అదృష్టవంతుడు అనుకున్నాడు జగన్నాథం.

ఆ వ్యక్తి కళ్లు తెరిచి, "డాక్టరుగారూ నేను బతుకుతానంటారా!" అన్నాడు.

జగన్నాథంకు అంత టెన్షన్‌లోనూ నవ్వొచ్చింది.

"మరి! బతకాలనే కోరిక వున్నప్పుడు ఎందుకు ఈ పని చేసావ్!" అన్నాడు.

"ఏదో క్షణికావేశం!" అన్నాడు ఆ వ్యక్తి కళ్లు మూసుకుంటూ

వాడవలసిన మందుల వివరాలు చెప్పి ఆ ఇంట్లోంచి బైటకు నడిచాడు జగన్నాథం. ఇంటికి వచ్చాక తిరిగి పడుకుందామనుకున్నా నిద్ర పట్టలేదు. కలలోని మనిషి గుర్తు కొచ్చాడు మరోసారి.

వాస్తవంగా ఉరి తీసుకున్న వ్యక్తిని చూసినా కలగని జలదరింపు కలలో ఆ దృశ్యం చూసేసరికి కలుగుతోంది. ఎందుకని? ఆలోచిస్తూనే మంచం మీద ఇటూ దొర్లేడు. అరగంట సేపు ప్రయత్నించినా అతడికి నిద్ర పట్టలేదు. క్లినిక్ రూములోనికి నడిచాడు. నిద్ర మాత్రల సీసా కోసం వెతికి మూత తెరిచాడు. ఆశ్చర్యం? ఒక్కమాత్రా లేదు. తన పేషంట్స్‌కి ఇచ్చిన గుర్తులేదు. తెప్పించిన మాత్రలు ఏమయినట్టు?

ఇంట్లో వుండేది తనూ, నెల క్రితం వరకు భార్య. మరి తనిప్పుడు ఒంటరి. ఆలోచించే కొద్దీ జగన్నాథంలో భయం నీడలు. తమ మెడికల్ షాపుకి పంపే లిస్టు చూసేడు. నిద్రమాత్రలు రాసింది తను కాదు, ఆ రాత తన భార్యది!

'మైగాడ్... ఆమెది సహజ మరణం కాదా! డాక్టరై వుండీ తను

కనుక్కోలేక పోయాడా?' - జగన్నాథంకు తల దిమ్ముగా అనిపించి క్షణకాలం పాటు అచేతనంగా వుండిపోయాడు. ఆమె చనిపోయిన రోజు ఏం జరిగింది? గుర్తుకు తెచ్చుకోవ డానికి ప్రయత్నించాడు. అది జూలై పదిహేనో తారీఖు. ఇంకో వారంలోగా తనకు బైపాస్ జరగబోతుందనగా-

ఆ రాత్రి తనకు అర్ధరాత్రి వేళ ఊపిరి ఆడనట్టనిపించింది, బాగా చెమటలు పట్టాయి. భయం వేసింది. అప్పటికే ఆమె గాఢ నిద్రలో వుంది. తనకు తెలిసిన నర్సింగ్ హెూంకు ఫోను చేస్తే వాళ్ళు అంబులెన్సు పంపారు. ఆమెకు తెలీకుండా తను బయలుదేరి వెళ్లాడు. తనకు ఇంజక్షన్లు చేసి ఐసియూలో వుంచారు. తెల్లారేవరకు వుండి తిరిగి వచ్చేసాడు భార్య భయపడుతుందని, అప్పటికీ ఆమె. నిద్ర పోతూనే వుంది.

ఆమెను లేపడం ఇష్టంలేక

ఆస్పత్రి వారిచ్చిన డ్రగ్స్ ప్రభావంతో ఆదమరచి నిద్రపోయాడు. ఉదయం ఎనిమిదింటికి తను లేచేవారికి ఇంకా ఆమె నిద్రలోనే ఉంది. అనుమానం వచ్చి తను చూసేసరికి చల్లగా తగిలిన ఒళ్లు. జరిగిన విషయం గుర్తుకొచ్చి జగన్నాథం కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

ఆమె నిద్దట్లోనే మాసివ్ స్ట్రోక్‌కు గురై చనిపోయివుందనుకున్నాడు. ఆశ తీరక మరో డాక్టరును తీసుకొచ్చి చూపించాడు. ఆయనా అదే చెప్పాడు.

"అదృష్టవంతురాలు, నిద్దట్లోనే చనిపోయింది. సునాయస మరణం" అన్నారు వచ్చిన బంధువులు. మరి తను ఎవరి కోసం బైపాస్ చేయించు కున్నాడు! తన భార్య ఆత్మహత్య చేసుకోవటం తనకు భరించలేని విషాదం కలిగిస్తోంది. ఇది నిజం కాకపోతే ఎంత బావుంటుంది? అలా ఆలోచిస్తూనే భార్య సూట్‌కేస్ తెరిచాడు. ఆమె అప్పుడప్పుడు రాసే డైరీ పేజీలు తిప్పాడు.

జూలై 10 : ఆయనకు పరీక్షలు చేసారు. బైపాస్ తప్పనిసరి అట.

డెభయ్యేళ్లు దాటాయి. బి.పి., షుగర్ వున్నాయి. రిస్కు అంటున్నారు. నాకు భయంగా వుంది.

జూలై 11 : ఆయనకు కొన్ని రోజుల్లో ఆపరేషన్. ఆయనలేని ఒంటరి జీవితం ఊహించగలనా! పిల్లలు లేరనే దిగులు లేకుండా ఆయనతో అరవయ్యేళ్లు జీవితం నెట్టుకొచ్చాను. ఆయనకేమైనా అయతే ఏమిటీ దారి?

జగన్నాథం మరి చదవలేకపోయాడు. తన భార్య ఆత్మహత్య చేసుకుందన్న చేదు నిజాన్ని భరించలేపోతున్నాడు. అతడి కళ్లనించి అశృధారలు అవిరామంగా కారుతున్నాయి. మనసు నిండా దిగులు మేఘాలు. తట్టుకోలేని మనసు అతడిని క్షణం నిలువనీయడం లేదు. గబ గబా రూము దాటి బైట కొచ్చాడు. తాము వుంటున్న నాలుగో ఫ్లోర్ దాటి పైకొచ్చాడు. టెర్రస్ మీద నిలబడ్డాడు.

వెనుక ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు. కార్పోరేషన్ వీధి లైటు వెలుగులో ఆమెను గుర్తుపట్టాడు. తమ ఫ్లోర్‌లోనే వుంటున్న సింహాచలంగారి భార్య. ఈ రాత్రిపూట ఆమెకు టెర్రస్ మీద ఏం పని? అయినా చనిపోబోతున్న తనకు ఆ విషయం ఎందుకు? మెల్లగా పిట్టగోడ దగ్గరకు చేరుకున్నాడు. క్రిందికి చూసేసరికి కళ్లు తిరిగనట్టయింది. జగన్నాథానికి. నగరం ఇంకా నిద్రపోలేదు. మబ్బులు కమ్మిన ఆకాశం, ఆ టెర్రస్ మీద నుంచి నిర్మలంగా కనిపిస్తోంది. చలికి శరీరం సన్నగా వణికింది. ఆ పల్చటి చీకటి తెరల మధ్య, ఆ నిశ్శబ్దపు వాతావరణంలో తను తీసుకోబోతున్న నిర్ణయానికి, క్షణం సేపు భయం కలిగింది. అయినా మళ్ళీ సర్దుకున్నాడు.

'ఔను బ్రతకడానికీ ధైర్యం కావాలి!'. మళ్ళీ కిందికి చూసాడు జగన్నాథం. వాహనాల సందడి. అందరూ హడావుడిగా తిరుగుతున్నారు. ముందుగా తల చిట్లుతుంది. స్కల్ పగిలి మెదడు బైటకు వస్తుంది. ఆ తర్వాత చల్లగా హాయిగా. నుదుటి మీద పెద్ద బొట్టుతో పసుపు రాసుకునే ముఖంతో కనిపించే

భార్య గుర్తుకొచ్చింది. 'నేనూ నీ దగ్గరకే వచ్చేస్తున్నాను' - ఊపిరి పీల్చి వదిలాడు. ఇంతలో గాజుల చప్పుడు - వెనక్కి తిరిగాడు... ఇందాక తను చూసిన ఆమె. టెర్రస్ మీద నుంచి క్రిందికి చూస్తోంది.

మైగాడ్ నాలా ఆమె ఆత్మహత్యకు సిద్ధపడిందా? ముగ్గురు పిల్లల తల్లి. ఆమె పోతే ఆ పిల్లల్ని చూసేదెవరు?'

రెప్పపాటు కాలంలో జగన్నాథం ఆమె వైపు నడిచాడు. అతడి చెయ్యి ఆమెను వెనుక్కు లాగింది. ఊహించని ఈ పరిణామానికి ఆమె విస్తుబోతూ వెనక్కి తిరిగింది. బాగా ఏడ్చిన ఆనవాలుగా ఆమె కళ్ళు ఉబ్బి వున్నాయి. ఆమె వయస్సు పాతిక దాటి వుండదు. తన వయస్సు ఆమె వయస్సు కన్నా మూడురెట్లు. తను జీవితాన్ని చూసి చూసి చివరి అంచులో వున్నాడు. ఆమె ఇంకా ఆరంభంలోనే వుంది. అయినా ఇద్దరూ ఒక అమానుషమైన నిర్ణయానికి వచ్చేసారు.

ఆలోచనల్లోనే ఆమెను పరీక్షగా చూస్తూ... "ఏంటమ్మా. ఇంతటి భయంకరమైన నిర్ణయం తీసుకున్నావ్?" అన్నాడు జగన్నాథం.

"నా భర్త సంగతి మీకు తెలీదు. తాగుబోతు, తిరుగుబోతు ఊరి నిండా అప్పులు. అర్ధరాత్రుళ్ళు తాగొచ్చి కొడతాడు..... చూసారా! ఈ దెబ్బలు" అంటూ చెంపలు, మోచెయ్యి చూపించింది. వాటి మీద గాయాల ఆన వాళ్ళు. అలా చూపిస్తూ ఆమె ఏడుస్తోంది.

"అమ్మాయీ ఒక్క క్షణం ఆలోచించు. నువ్వు పోతే నీ కడుపున పుట్టిన నీ పిల్లలు ఏమవుతారు?" అన్నాడు జగన్నాథం.

"అయ్యో నా పిల్లలు ఒక్క క్షణం కనబడకపోతే అమ్మా.... అంటూ ఏడుస్తారు." అంటూ ఆమె గబగబా అక్కణ్ణించి పరుగులాంటి నడకతో క్రిందికి దిగుతోంది. వెళుతున్న ఆమెను చూస్తూ జగన్నాథం ఆశ్చర్యానికి

లోనయ్యాడు. అతడి శరీరంలో జలదరింపు. గుండెలో అలజడి. తను ఆత్మహత్య చేసుకుందామని తీసుకున్న నిర్ణయం గురించి ఆలోచించే కొద్దీ అతడిలో భయపు నీడలు.

'ఒక్క క్షణం. ఔను, చావు కోరుకోవడానికి, చావు వద్దనుకోవడానికి తేడా ఒక్క క్షణం..... ఆ ఒక్క క్షణం ఆపగలిగితే' - ఇక జగన్నాధానికి అక్కడ వుండాలనిపించలేదు. గబగబా మెట్లు దిగి ఇంట్లోకి నడిచాడు.

* * *

ఉదయం నిద్ర లేచిన జగన్నాధం వాకింగ్‌కు వెళదామని బైటకొచ్చాడు. ఎదురు ఫ్లాట్ వంక చూశాడు. రాత్రి కనిపించిన ఆ అమ్మాయి తన పిల్లలను ఆడిస్తూ, టిఫిన్ తినిపిస్తోంది. జగన్నాధం వంక చూసి రెండు చేతులూ జోడించింది.

చెయ్యి పైకెత్తి 'గ్లాడ్ బ్లెస్ యు' అంటూ బైటకు నడిచాడు.

నడుస్తున్న జగన్నాధంలో రకరకాలయిన ఆలోచనలు ముసురు కున్నాయి. రెండు రోజుల క్రితం ఉరి తీసుకోబోతున్న వ్యక్తికి చికిత్స చేసి రక్షించాడు. ఆ సమయంలో 'అయ్యా నేను బతుకుతానా?' అన్నాడా అభాగ్యుడు. అంటే ఆ క్షణంలో ఆపగలిగితే ఇంకెప్పుడూ చనిపోడు. ఔను అంతే! ఆ క్షణమే తన ఎదురు ఫ్లాట్ అమ్మాయిని ఆత్మహత్యనించి ఆప గలిగింది. అదీ తనకు స్వానుభవమే. అంతే ఆ ఒక్క క్షణం ఆలోచించ మనాలి. అలా ఆలోచిస్తున్న అతడిలో ఒక ఆలోచన ఊపిరి పోసుకుంది.

* * *

ఆ రోజే జగన్నాధం ఒక దినపత్రిక కార్యాలయానికి వెళ్ళి ఎడిటర్ గారిని కలిసాడు. తను తయారు చేసిన ప్రకటన అందించాడు.

దుఃఖపడుతున్న నేస్తమా!

ఇదిగో స్నేహ హస్తం

జీవితం అందమైనది

దాన్ని ముందుగా అంతం చేసుకోకు

అలాంటి నిర్ణయం కలిగితే

ఒక్క క్షణం ఆలోచించు

ఏ సమస్యకైనా పరిష్కారం వుంది

ఫోన్ నెంబర్ 0891 2564989 లేదా 9393129945కి ఫోన్

చెయ్యి

- స్పందన

ఆ ప్రకటన, ఆ దినపత్రికలో మొదటి పేజీలో వచ్చింది. అదే ప్రకటనతో నగరంలో కొన్ని హెూర్డింగ్‌లు వెలిసాయి. ఇపుడు జగన్నాధానికి క్షణం తీరిక లేదు. ఒంటరివాడిననే బాధకు దూరమయ్యాడు.

*          *          *

వారం రోజుల తర్వాత ఒక రోజు మార్నింగ్ వాక్ చేస్తున్న జగన్నాధంకు, “సార్ నమస్కారం...!” అనే పిలుపు వినిపించింది.

తల విప్పి చూసాడు. ఒక అపరిచితుడు.

“అయ్యా! మీరు చేస్తున్న సామాజిక కార్యక్రమం బావుంది. ఆర్తితో చేసే ఆక్రందన ఆత్మహత్య. దానికి మీరు ఇలా స్పందించడం బావుంది. మీరిచ్చిన ఫోన్‌ని బట్టి మీరే ఈ పని చేస్తున్నారని గ్రహించాను. నిండు నూరేళ్ళ జీవితాన్ని బలవంతంగా ముగించు కుంటున్న అభాగ్యుల్ని ఒక్క క్షణం ఆలోచించమనడం, బాగా ఆలోచింపచేసే ప్రకటన, దానికి మీ పేరు కాకుండా స్పందన అనే పేరు పెట్టడం బాగా కుదిరింది. ఇంతకీ స్పందన ఎవరు?” అన్నాడా వ్యక్తి.

జగన్నాథం ఆయన మాటలకు వెంటనే, "ఒక అజ్ఞాత వ్యక్తి...." అంటూ ముందుకు నడిచాడు.

ఆ సమయంలో జగన్నాథానికి ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. చావబోతున్న ఆమె గుండె చప్పుడు ఆత్మహత్యకు సిద్ధమయిన తన గుండెకు వినిపించింది. ఆ అమ్మాయి పేరు 'స్పందన'. అదే విచిత్రం. స్పందన గురించి ఆలోచించేకొద్దీ జగన్నాథం కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. దుఃఖంతో కాదు. ఆనందంతో.

(రచన ఏప్రిల్ 2008)